క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జగన్

జక్రాన్‌పల్లి: మండలంలోని బాలనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమిర రాజు తల్లి ఇటీవల మృతిచెందింది. బాధిత కుటుంబ సభ్యులను ధర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ గురువారం పరామర్శించారు. నాయకులు అర్గుల్ నర్సయ్య, అప్పల అరుణ్, కుంచాల రాజు, రంగ్యానాయక్, ప్రశాంత్, సంతోష్, శ్రీను, మల్లేశ్, నవీన్, రవి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న శేఖర్‌గౌడ్

మోపాల్: మండలంలోని బాడ్సి, సింగంపల్లి, చిన్నాపూర్ గ్రామాలకు చెందిన పలు బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.4లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ బాధితులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి, ఈరమ్మ జగదీశ్‌రెడ్డి, మంగూరపు రవి, గొడుగు రాజు, భిక్షపతి, గూండ్ల పోశెట్టి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారి నర్సింగ్‌రావు

ఖలీల్‌వాడి: అగ్నిమాపక వారోత్సవాల భాగంగా జిల్లా కేంద్రంలోని హెచ్‌పీగ్యాస్, ఇండియన్ గ్యాస్ గోడౌన్‌లో పనిచేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కె సుమన్, ప్రశాంత్ గౌడ్, సురేందర్, రుత్విక్, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

రైతు రక్షణ కార్యక్రమంలో భాగస్వాములమవుదాం

డిచ్‌పల్లి: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా జల్ జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ కృషి చేస్తుందని జనని ఫౌండేషన్ హైదరాబాద్ ప్రతినిధి బాకి బైరిరెడ్డి పేర్కొన్నారు. సంస్థలో సభ్యులుగా చేరి రైతు రక్షణ కార్యక్రమంలో భాగస్వాములవుదామని కోరారు. గురువారం డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లిలో జల్ జీవన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బైరిరెడ్డి మాట్లాడారు. ఈ సంస్థలో సభ్యులుగా చేరిన వారికి రూ. రెండు లక్షల విలువ గల ప్రమాదబీమా పాలసీ కల్పిస్తారని అన్నారు. కార్యక్రమంలో మల్లేశ్, రవికుమార్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై ఈడీ కేసులు అక్రమం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా ఈడీ కేసులు బనాయించిందని జిల్లా కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. గురువారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు జావెద్ అక్రమ్, వేణురాజ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో విపుల్‌గౌడ్, బొబ్బిలి రామకృష్ణ, సుమన్, మఠం రేవతి, బోర్గాం శ్రీనివాస్, పూల ఉష, బింగి మధుసూదన్, ప్రమోద్, రాజ్ గగన్, కౌశిక్, హరీశ్, మలేక బేగం, ప్రవీణ్ కుమార్, కోనేరు సాయికుమార్, అపర్ణ, పుప్పాల శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకులు అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం రైల్వే స్టేషన్, స్నేహ సొసైటీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా వంతెన

- శిథిలావస్థలో కొండాపూర్ అలుగు వాగు వంతెన
- వంతెన అడుగు భాగంలో కోతకు గురవుతున్న రాళ్లు


వంతెన అడుగు భాగంలో ఊడిపోతున్న రాళ్లు


శిథిలావస్థకు చేరిన వంతెన

సిరికొండ: మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సిరికొండ మండల కేంద్రం నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో గోప్య తండా వద్ద కొండాపూర్ ఊర చెరువు అలుగు వాగుపై నుంచి ప్రధాన రహదారి వెళ్తుంది. ఈ వాగుపై సుమారు 35 ఏళ్ల క్రితం బండ రాళ్లతో వంతెనను నిర్మించారు. వంతెన నుంచి వాగు లోతుగా ఉంటుంది. వంతెన నిర్మించి చాలా ఏళ్లు గడుస్తుండటంతో వాగు ప్రవాహానికి వంతెన అడుగు భాగం దెబ్బతింటోంది. వంతెనను నాటి సాంకేతికతకు అనుగుణంగా బండ రాళ్లతో నిర్మించారు. వరద ఉధృతికి ప్రతి ఏటా వంతెన అడుగు భాగంలో కోతకు గురవుతూ రాళ్లు పడిపోతున్నాయి. వంతెన పై భాగంలో కూడా స్లాబ్ ధ్వంసమైంది. సిరికొండ మండలంతో పాటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీంగల్ మండలాలకు చెందిన ప్రజలు హైదరాబాద్ వెళ్లడానికి ఈ మార్గాన్నే వినియోగిస్తారు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడంతో నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా మారింది. రోడ్డు డబుల్‌గా ఉండి వంతెన సింగిల్ రోడ్డుతో ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వంతెనకు ఇరు పక్కల రెయిలింగ్ కూడా దెబ్బతింది. రెయిలింగ్ లేకపోవడంతో రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారింది



కామారెడ్డి వెళ్లే రోడ్డులో కొండాపూర్ వాగుపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వంతెనపై స్లాబ్ ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి.రెయిలింగ్ విరిగిపోయింది. వంతెనపై నుంచి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వంతెన శిథిలావస్థకు చేరడంతో అవస్థలు పడుతున్నాం.

– కిరణ్, గడ్కోల్

నిధులు మంజూరు చేయాలి



వంతెనను చాలా ఏళ్ల క్రితం నిర్మించారు. వంతెన అడుగు భాగంలో రాళ్లు ఊడిపోతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లు తయారైంది వంతెన పరిస్థితి. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా చేయడంతో రద్దీ ఎక్కువైంది. శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలి.

– రహీం, కొండాపూర్

గాంధీభవన్‌లో నిజామాబాద్ పార్లమెంటరీ సమావేశం

- పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ సిటీ: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు. గురువారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజామాబాద్ పార్లమెంటరీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్ యాదవ్, టీపీసీసీ వర్కింగ్ అనిల్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ పార్లమెంటరీ పరిధిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. జైబాపు.. జైభీం .. జైసంవిధాన్ కార్యక్రమంలో జరుగుతున్న విధానాన్ని నాయకులు వివరించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు సన్మానం



మోపాల్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం జిల్లాలో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిస్థితులు, అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, రూరల్ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు, పథకాలపై ప్రజల మనోగతాలు, పలు అంశాలపై మీనాక్షి నటరాజన్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు.

జీజీహెచ్‌ను వెయ్యి పడకలకు పెంచాలి

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఎంఈ నరేంద్రకుమార్‌కు గురువారం విన్నవించారు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు పి సుధాకర్, నాయకులు భాగ్యలక్ష్మి, హైమది, స్వరూప, వెంకటేశ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. గురువారం ఉదయం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో కార్మికులు చేస్తున్న ధర్నాకు టీయూసీఐ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో నాయకులు ముష్క సుధాకర్, మల్లేశ్, సత్తెక్క, బి మురళి, కిరణ్, అరవింద్, రాజేశ్వర్, సాయిబాబా, మల్కయ్య, దుర్గ, రమేశ్, రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ఉత్సవాలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని గాయత్రినగర్‌లో ఉన్న సిద్ధివినాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం సిద్ధి వినాయక స్వామి ఆలయంలో సహస్ర గణపతి అధర్వశీర్ష పారాయణం, అభిషేకం, గణపతి హోవనము(యజ్ఞం)నిర్వహించారు. కొనసాగుతున్న ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ మచ్చ చంటయ్య కోరారు.

సిర్‌పూర్‌లో ఉపాధ్యాయుల బడిబాట


సిర్‌పూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పొందిన బహుమతుల వివరాలు, విద్యార్థులు రూపొందించిన సిరిలేఖల పుస్తకాన్ని తల్లిదండ్రులకు అందజేశారు. గ్రామంలోని విద్యార్థులందరూ సిర్‌పూర్ పాఠశాలలోనే చేర్పించాలని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, డాక్టర్ హజారే శ్రీనివాస్, లాటికర్ రాము, డాక్టర్ కాసర్ల నరేశ్ పాల్గొన్నారు.

రేకుపల్లిలో..

ధర్పల్లి: సర్కార్ బడిలో పిల్లలను చదివిస్తే నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. మండలంలోని రేకులపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగారెడ్డి, అంకం నరేష్ ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు బోధిస్తున్న విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చేతిలో ఈడీ కీలుబొమ్మ



నిజామాబాద్ సిటీ: ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మగా మారిన ఈడీ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అక్రమ ఛార్జ్‌షీట్‌లు దాఖలు చేసిందని టీపీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ అన్నారు. గురువారం రాష్ట్ర కాంగ్రెస్ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న అనిశ్చితి పరిస్థితిల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు బీజేపీ ఈడీ కేసుల నాటకం ఆడుతోందదన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులపై నేషనల్ ఎరాల్డ్ పత్రిక అంశాన్ని తీసుకొచ్చి అక్రమంగా ఈడీ కేసులు బనాయించారని మండిపడ్డారు. న్యాయపరంగా, ప్రజాస్వామ్యయుతంగా బీజేపీ పెట్టిన అక్రమ కేసులను ఎదుర్కొంటామని దయాకర్‌గౌడ్ పేర్కొన్నారు.

సంక్షిప్తం

పోలీసులకు హోమియో మందుల పంపిణీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ట్రాఫిక్ పీఎస్ ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు గురువారం డాక్టర్ పద్మజాకులకర్ణి, డాక్టర్ అనంత్ కులకర్ణి వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ అధ్యక్షులు పద్మ శ్రీనివాస్, రంజిత్ సింగ్ ఠాకూర్, సూర్య ప్రకాశ్, బంగారి వీరబ్రహ్మం, గంజి రమేశ్, వేముల చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌కు ప్రత్యేక బ్రేకర్ ఏర్పాటు

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ సబ్‌స్టేషన్‌లో మనోహరాబాద్ గ్రామానికి 11 కేవీ విద్యుత్ లైన్‌కు ప్రత్యేక బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ భాలేష్, డిచ్‌పల్లి టెక్నికల్, ఇన్‌చార్జి డీఈఈ రమేశ్ హాజరై ప్రత్యేక బ్రేకర్‌ను ప్రారంభించారు. పడకల్ సెక్షన్ పరిధిలోని కలిగోట్ సబ్‌స్టేషన్‌లో పాత పరికరాలను పూర్తిగా తీసివేసి కొత్త వాటిని బిగించారు. కార్యక్రమంలో పడకల్ ఏఈ భాస్కర్, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మత ఫాసిజాన్ని తరిమికొడదాం

సిరికొండ: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశంలో మత ఫాసిజాన్ని తరిమి కొడదామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కార్యదర్శి ప్రభాకర్ కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రామృష్ణ, బాకారం రవి, దేగాం సాయన్న, సల్ల రాజారెడ్డి, గొల్ల జనార్దన్, బాబన్న, లింబాద్రి, సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

డిచ్‌పల్లి: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం భూ భారతిని తీసుకువచ్చిందని, దీనిపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, మండల వ్యవసాయాధికారి సుధామాధురి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ సంతోష్, ఏఆర్‌ఐ భూపతి ప్రభు, సొసైటీ చైర్మన్ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు

సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కువ వడ్డీతో అప్పులు ఇస్తున్న వ్యక్తుల ఇళ్లపై ధర్పల్లి సీఐ భిక్షపతి ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. కుర్దుల్‌పేట్‌లో గాండ్ల సతీశ్ వద్ద రూ.83లక్షలు విలువ చేసే ప్రామిసరీ నోట్లు, కొన్ని చెక్కులు, మైలారంలో గడ్డల గంగాదాసు వద్ద రూ.56లక్షలు విలువ చేసే 213 ప్రామిసరీ నోట్లు, గడ్కోల్ గ్రామానికి చెందిన మచ్చర్ల గంగారెడ్డి వద్ద రూ.13లక్షలు విలువ చేసే 11 ప్రామిసరీ నోట్లు, కామారెడ్డి రాజు వద్ద రూ.23లక్షలు విలువ చేసే 14 ప్రామిసరీ నోట్లు లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమాచారం..

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

మోపాల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న భూభారతిపై శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మోపాల్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రామేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సును రైతులు విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

నేడు ఎమ్మెల్సీలకు ఆత్మీయ అభినందన సభ

సుభాష్‌నగర్: నగరంలోని వర్ని చౌరస్తాలో ఉన్న జనార్దన్ గార్డెన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఇటీవల ఎమ్మెల్సీలుగా విజయం సాధించిన మల్కా కొమరయ్య, అంజిరెడ్డికి ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

21న జిల్లాకేంద్రంలో సీపీఎం ధర్నా

నిజామాబాద్ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి ఈనెల 21న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నాయకులు రమేశ్‌బాబు, పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సుభాష్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై కాంగ్రెస్ నేత అంజన్‌కుమార్ యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అలాగే ప్రధాని మోదీపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీ పేర్లు చార్జీషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి సమక్షంలో కిషన్‌రెడ్డిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ అంటేనే కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ అని, నిజాలు బయట పడుతుంటే భరించలేని ఆ పార్టీ నాయకులు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ బీజేపీ నాయకులు, మోదీపై అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అద్దంకి దయాకర్, అంజన్ కుమార్ యాదవ్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

వినియోగదారుల సమన్వయ సమితి ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసచారి


శ్రీనివాసచారికి నియామకపత్రం అందజేస్తున్న సాంబరాజు చక్రపాణి

సుభాష్‌నగర్: దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ఉపాధ్యక్షుడిగా తంగళపల్లి శ్రీనివాసచారి నియామకమయ్యారు. ఈమేరకు గురువారం నగరంలోని ఓ హోటల్‌లో వినియోగదారుల మండలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వినియోగదారుల సమన్వయ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి శ్రీనివాసచారికి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. తెలంగాణతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల ఉద్యమాన్ని పటిష్టవంతం చేయడానికి వినియోగదారుల సమన్వయ సమితిలో నియామకాలను చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బీఎస్‌ఐ స్టాండర్డ్స్ కమిటీలను జూన్ 30లోగా పూర్తి చేస్తామన్నారు. వినియోగదారులకు కల్తీ, నాసిరకం లేని వస్తు సేవలను అందించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. ఈసందర్భంగా సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. సమావేశంలో వినియోగదారుల సంక్షేమ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నాం


సమావేశంలో మాట్లాడుతున్న సిద్దయ్య

నిజామాబాద్‌నాగారం: మానసిక దివ్యాంగుల పాఠశాల, అంధుల ప్రత్యేక పాఠశాలలో ప్రత్యేక విద్యను అందిస్తున్నామని స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య అన్నారు. మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ వారి మానసిక దివ్యాంగుల పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ ద్వారా నిధులు సమకూరుతున్నాయని అన్నారు. 275 మంది దివ్యాంగులకు ప్రత్యేక విద్యను అందిస్తున్నామన్నారు. మానసిక దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా మానసిక వికలాంగులు వారి చికిత్స కోసం వెచ్చించిన వ్యయాన్ని తిరిగి పొందవచ్చని తెలిపారు. మానసిక వికలాంగులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జ్యోతి, రాజేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిన్నిస్‌బుక్ విద్యార్థికి సన్మానం



నిజామాబాద్ రూరల్: నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాజీవ్‌నగర్‌కు చెందిన బోగం విజయ్‌రాజ్‌కు గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది. 2024 డిసెంబర్ 1న మిస్టర్ అగస్టీన్, దండింగి వేణుగోపాల్, హాలెల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా దేశ వ్యాప్తంగా 1046 మంది విద్యార్థులతో గంట వ్యవధిలో కీబోర్డు వాయించి, వీడియోను సామాజిక మధ్యమాల్లో ఆప్‌లోడ్ చేసినందుకు గిన్నిస్‌బుక్‌లో విద్యార్థి పేరు లిక్కించారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఎస్‌లో విజయ్‌రాజ్‌ను శాలువ, మెమోంటోతో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సిరికొండ: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో కేఆర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా కాని పందిమడుగు, సేవాలాల్ తండా, బాసునూతి తండా, బాల్‌రాజ్ తండా, నామ్డ తండా, పాకాల జీపీ పరిధిలోని సబావత్ తండాల్లో ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అర్షద్ గురువారం పర్యటించారు. ఆయా చోట్ల నీటిని ఏ విధంగా అందించాలనేది వారు పరిశీలించారు. బోర్లను అద్దెకు తీసుకోవడం, కొత్త బోరు బావులను తవ్వించడం కోసం ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	95,200	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	88,060		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	100	150	గోబిగడ్డ	10	20
కాకరకాయ	50	90	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	75
కొత్తిమీర	30	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 ఓదెల-2(తెలుగు)-10.40, 1.30, 4.30, 7.20, 10.20
స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-11.00, 10.40
ఒక్కడు(తెలుగు)-1.40, 7.40
స్క్రీన్-3 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)-11.00, 1.35, 4.30, 7.25, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి(తెలుగు)-10.00, 1.00, 4.00, 7.00, 10.00
స్క్రీన్-2 ఓదెల-2(తెలుగు)-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3 పాడింగ్టన్ (హిందీ)-11.05
జాట్(హిందీ)-1.30
సిన్నర్స్(ఇంగ్లీష్)-4.40, 7.40, 10.40
స్క్రీన్ -4 డియర్ ఉమ(తెలుగు)-11.00
ది చూసన్ లాస్ట్ సూపర్(ఇంగ్లీష్)-2.10
జాక్(తెలుగు)-4.45- పాడింగ్టన్ (ఇంగ్లీష్)-7.40
మధురం(తెలుగు)-10.05

లలితామహల్ కోర్ట్ (తెలుగు)
దేవి అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (తెలుగు)
నటరాజ్ జాట్(హిందీ), **విజయ్** మ్యాడ్ స్క్వేర్